# పశ్చాత్తాపం

**-ఉలాపు బాలకేశవులు**

"**బా**బూ ప్రొద్దున్నుంచి మా మనవరాలికి తెగ వాంతులవుతున్నాయి. డాక్టరు గారిని కొంచెం తొందరగా చూడమనండి. మీకు ఎంతైనా పుణ్యముంటుంది..." అంటూ కాంపౌండర్ కనకయ్యని బ్రతిమాలుతున్నాడు చేతిలో ఒక పదేళ్ల పాపని ఎత్తుకొచ్చిన ముసలతను...

"ఏంటయ్యా నీ నస. అసలు కార్డు తీసుకున్నావా?" అడిగాడు కనకయ్య.

"తీసుకోలేదు బాబూ, ఎంతవుతుందేమిటి?" అడిగాడు ముసలాయన.

"మామూలు కార్డు అయితే వంద రూపాయలు. అది తీసుకుంటే సాయంకాలం అవుతుంది. అదే స్పెషల్ కార్డు అయితే 200 రూపాయలు. అది తీసుకుంటే ఒక పది నిమిషాల్లో డాక్టరు గారు చూసేస్తారు. ఏం రాయమంటావు" అడిగాడు కనకయ్య.

"అయ్యో అంత డబ్బు లేదు బాబూ. 50 రూపాయలే ఉంది. ముందు డాక్టరు గారిని చూడమనండి. డబ్బులు ఎలాగోలా తర్వాత పట్టుకొస్తాను. పిల్ల ఒళ్ళు కూడా కాలిపోతుందయ్య గిలగిల్లాడిపోతోంది."

"ఏంటయ్యా నీ గోల. ఇదేమన్న నా ఆస్పత్రి అనుకున్నావా? నీలాంటి వాళ్ల మీద జాలి చూపిస్తే నా ఉద్యోగం ఊడుతుంది" అన్నాడు కనకయ్య.

ఇంతలో బెల్ మోగింది... "డాక్టరుగారు పిలుస్తున్నారు, నెక్స్ట్ ఎవరూ?" అంటూ లోపలికెళ్లాడు కనకయ్య.

> ## దైవం
>
> **మొ**క్కల్లా మంచిని పెంచు
> పువ్వుల్లా ప్రేమను పంచు
> మేఘాలు కురిపించు వర్షంలా
> చూపించు కడవానిపై కరుణ
> అసూయ ద్వేషాలను త్రుంచు ముళ్ళలా
> మంచి, త్యాగం మూర్తీభవిస్తే
> కనిపిస్తాడు మనిషిలో దైవం
> మంచి ప్లస్ మనిషి ఈక్వల్టు దైవం.
>
> **-పరుచూరి శ్రీనివాసరావు**

"సార్" అంటూ వినయంగా చేతులు కట్టుకు నిలుచున్నాడు కనకయ్య. "ఏం బయట గొడవ" అడిగాడు డాక్టర్ మహేశ్.

"ఎవరో సార్, అర్జెంటుగా రోగిని చూడాలంటాడు. స్పెషల్ కార్డు కాదు గదా కనీసం మామూలు కార్డు తీసుకోవటానికి కూడా పూర్తిగా డబ్బులు లేవంటాడు" అన్నాడు కనకయ్య.

అసహనంగా మొహం పెట్టాడు డాక్టర్ మహేశ్. "ఇదొక న్యూసెన్సు, పొరపాటున ఒకళ్ళని జాలితలిచామంటే ఇక అందరూ అదే మొదలుపెడతారు. కుదరదని చెప్పి పంపేయ్. డబ్బులు పెట్టలేనప్పుడు గవర్నమెంటు ఆస్పత్రికి పోవచ్చుగదా. ప్రైవేటు నర్సింగ్ హోమ్‌కి ఎందుకు రావడం? డబ్బు లేకపోయినా కాస్ట్లీ ట్రీట్‌మెంట్ - అదీ అర్జంటుగా కావాలి తేరగా" అంటూ విసుక్కున్నాడు డాక్టర్ మహేశ్.

డాక్టర్ మహేశ్ అంటే ఆ ఊర్లో మంచి పేరే ఉంది. హస్తవాసి మంచిది, బాగా వైద్యం చేస్తాడు అని. మొదట్లో అందరికీ ఒకటే కార్డు, ఒకేలా చూసేవాడు. రానురాను రోగులు పెరిగి, డబ్బు సంపాదనతో వచ్చిన గర్వం వల్ల మిగతా డాక్టర్లు కొంతమందిని చూసి స్పెషల్ కార్డు సిస్టమ్ పెట్టాడు. స్పెషల్ కార్డు రాయిస్తే ముందు చూస్తాడు. అదే మామూలు కార్డు అయితే ఎంత సీరియస్ అయినా గంటల తరబడి వెయిట్ చేయవలసిందే.

కాంపౌండర్ కనకయ్య చెప్పింది విని ఉసూరుమంటూ బయటికి నడిచాడు ఆ ముసలతను.

❖ ❖ ❖

"రాణీ తొందరగా అన్నం పెట్టు" అరిచాడు డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న మహేశ్.

"ఎప్పుడూ ఆస్పత్రి, రోగులు, డబ్బు సంపాదన తప్ప పెళ్లాం, పిల్లలూ... వాళ్లతో సరదాగా గడుపుదాం అన్న ధ్యాసే లేదా మీకు" అంది రాణి.

"అలా అడుగు మమ్మీ డాడీని" అంది కుర్చీ లాక్కుని కూర్చుంటూ మహేశ్ కూతురు ప్రీతి.

"ప్రీతీ, మాధవ్ ఇంకా భోజనానికి రాలేదేం" అడిగాడు మహేశ్ కూతుర్ని.

"ఇదిగో డాడీ వస్తున్నా" అంటూ వచ్చేశాడు

మాధవ్.

❖ ❖ ❖

"హాలిడేస్ బాగా ఎంజాయ్ చేశారా ప్రీతీ, మధు" అడిగాడు పిల్లల్ని మహేశ్.

"థాంక్యూ డాడీ, చాలా బాగా ఎంజాయ్ చేశాం" అన్నారు ఇద్దరూ.

"అవునండీ, చాలా రోజులయింది కదా ఇలా టూర్‌కి వచ్చి మనం" అంది రాణి కూడా.

వాళ్లు తిరుగు ప్రయాణంలో బస్సులో ఉన్నారు.

"ఇంకెంత టైమ్ పడుతుంది డాడీ" అడిగింది ప్రీతి.

"ఇంకా అయిదారు గంటలు పడుతుందేమో" అన్నాడు మహేశ్.

"సాయంత్రం కావస్తోంది. పొలాల మధ్యలో నుంచి బస్సు వెళుతోంది కదా.. గాలి బాగా వీస్తోంది కదండీ" అంది రాణి.

ఇంతలో సడన్ బ్రేకుతో బస్సు ఆగింది. మొహానికి ముసుగులు వేసుకున్న నలుగురు ఆగంతకులు బస్సును ఆపి ప్రయాణికుల్ని బెదిరించి వాళ్ల దగ్గరున్నవన్నీ దోచుకున్నారు. అందరితో పాటు డాక్టర్ మహేశ్ ఫ్యామిలీ కూడా ఉత్త చేతులతో నిలబడిపోయారు.

"చేసేదేముంది. అందరూ బస్సు ఎక్కండి, దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్లో కంప్లయింట్ ఇచ్చి బయలు దేరుదాం" అన్నాడు కండక్టర్.

ఇంతలో ఒక్కసారిగా మాధవ్ కళ్లుతిరిగి కింద పడి బాధగా అరవసాగాడు. అది పొలాల మధ్య ప్రాంతం కావడంతో ఏ పురుగో కుట్టి ఉంటుందని అర్థమైంది. మహేశ్ స్వయంగా డాక్టరయుండీ ఏమీ చేయలేక నిస్సహాయంగా చూశాడు.

"దగ్గర్లో ఏదైనా ఆస్పత్రి ఉందేమో వెళదాం పదండీ" అన్నారందరూ.

నలుగురైదుగురు కలిసి మహేశ్‌తో కలిసి మాధవ్‌ని తీసుకుని దగ్గర్లో వున్న ఆస్పత్రికి వెళ్లారు.

లోపలికెళ్లిన మహేశ్ అక్కడ ఉన్న నర్సుతో "బాబుకి ఏదో పురుగు కుట్టింది. డాక్టర్‌ని తొందరగా చూడమనండి, ప్లీజ్" అన్నాడు.

"ముందు డబ్బు కట్టి కార్డు తీసుకోండి. తరువాత డాక్టరు గారు చూస్తారు" అంది తాపీగా.

"అందేటి సిస్టర్? బాబు చావుబ్రతుకుల మధ్య వుంటే డబ్బులంటారేంటి. ముందు డాక్టర్‌ని చూడమనండి. నేనూ డాక్టర్‌నే! డబ్బులు మీకు ఎలాగైనా తరువాత పంపుతాను. కొన్ని అనుకోని పరిస్థితుల్లో డబ్బు పోగొట్టుకున్నాం" అంటున్న మహేశ్ మాటల్ని వినకుండా "అలాంటివేమీ ఇక్కడ కుదరవండి. డాక్టరు గారు చూడాలంటే డబ్బు కట్టాలి. అదీ తొందరగా చూడాలంటే స్పెషల్ కార్డు తప్పనిసరి. ఇక్కడే కాదు ప్రతీ ఆస్పత్రిలోనూ ఈ రూల్స్ మామూలే. అంతగా డబ్బులు కట్టలేకపోతే గవర్నమెంటు ఆస్పత్రికి పోవచ్చు కదా" అంది నర్స్ నిర్లక్ష్యంగా.

చెంపమీద చెళ్లున కొట్టినట్టయింది డాక్టర్ మహేశ్‌కి. గతం గుర్తొచ్చి నోట మాటరాక అలా నిలుచుండిపోయాడు.

ఇంతలో ఇదంతా దూరం నుంచి చూస్తున్న ఓ పెద్దాయన, "సిస్టర్, మనీ నేను ఇస్తాను. స్పెషల్ కార్డు రాసి ఆ అబ్బాయిని వెంటనే చూడమని డాక్టరు గారికి చెప్పండి" అన్నాడు.

మహేశ్‌కి దేవుడిలా కనిపించాడాయన. కృతజ్ఞతగా చూశాడాయనవైపు.

కుట్టింది ఏదో ప్రమాదకరమైన పురుగే కానీ, వెంటనే తీసుకురావడం వల్ల సేవ్ చేయగలిగాం అన్నాడు డాక్టర్.

డాక్టర్‌కి కృతజ్ఞతలు చెప్పిన మహేశ్, ఆ పెద్దాయన వైపు తిరిగి, "అంతా మీ చలవే. మీరు సమయానికి డబ్బు కట్టి సాయం చేయకపోతే మా అబ్బాయి మాకు దక్కేవాడు కాదు" అంటున్న మహేశ్‌తో "డబ్బుదేముందండి. ఇవాళ కాకపోతే రేపు సంపాదించవచ్చు. అన్నిటికన్నా విలువైనది మనిషి ప్రాణం. దానిని డబ్బుతో ముడిపెట్టి చూడలేం కదండీ" అన్నాడు ఆ పెద్దాయన. "అయినా పాపిష్టి డబ్బు కోసం మనుషుల ప్రాణాలకే ఆపద కలుగుతుంటే నేనేకాదు మీరైనా చూస్తూ ఊరుకోలేరు కదండీ" అన్నాడాయనే మళ్లీ. గుండెల్లో పశ్చాత్తాపం కలుగుతుండగా ఆయనకి మరోసారి కృతజ్ఞతలు చెప్పి అక్కడి నుంచి కదిలాడు డాక్టర్ మహేశ్.

"ఇక నుంచి మన ఆస్పత్రిలో స్పెషల్ కార్డు సిస్టమ్ తీసేయాలి. ఒకటే కార్డు. అది కూడా పేదవాళ్లకు ఉచితంగా వైద్యం చేస్తాను. డబ్బు లేదని ఎవరూ వైద్య సహాయం లేక ఇక్కడ్నుంచి వెనక్కి వెళ్లకూడదు" అంటున్న డాక్టర్ మహేశ్ వైపు ఆశ్చర్యంగా చూశారు కనకయ్య, మిగిలిన స్టాఫంతా. ఆ రోజు నుంచి డాక్టర్ మహేశ్ మంచి హస్తవాసున్న వాడిగానే కాక మంచి మనసున్న డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు.

■